సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 25 । జూన్ । 2023



విద్యుత్ అంతరాయంతోనే..

వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతోనే నీటి సరఫరాలో సమస్యలు వచ్చాయని మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్ తెలిపారు.

10లో



రాణాల నిర్మాణంలో జాప్యం

జిల్లాలో పోలీసు స్టేషన్ల నిర్మాణాలు మూడేళ్లయినా పూర్తికాలేదు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవలలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ బాలాజీ కల్యాణం



స్వామి వారి కల్యాణం చేస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్లింగ్‌కు గ్రీన్ సిగ్నల్

తెరపైకి డోర్నకల్ - భద్రాచలం రోడ్ రెండో లైన్

- ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించిన రైల్వేశాఖ
- త్వరలో పట్టాలెక్కనున్న నిర్మాణ పనులు
- పూర్తయితే రైళ్ల ఆలస్యానికి చెక్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల మీదుగా వెళ్లే డోర్నకల్ - భద్రాచలంరోడ్ లైన్ డబ్లింగ్ పనులకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ప్రత్యేక ప్రాజెక్టుగా ఈ పనులు చేపట్టాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. అన్నీ కుదిరితే మరో ఆరు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

గూడ్సు రైళ్లకే ప్రాముఖ్యత

డోర్నకల్ జంక్షన్ నుంచి భద్రాచలం రోడ్డు వరకు ప్రస్తుతం సింగిల్ లైన్ అందుబాటులో ఉంది. ఈ మార్గం గుండానే ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం, సత్తుపల్లిలో ఉత్పత్తి అయిన బొగ్గును దేశంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు డోలమైట్ రవాణాకూ ఈ మార్గమే కీలకం. దేశంలో థర్మల్ విద్యుత్‌కు విపరీతమైన డిమాండ్ ఉండటంతో భద్రాచలంరోడ్ నుంచి డోర్నకల్ వరకు బొగ్గు రవాణా చేసే గూడ్స్ రైళ్ల రాకపోకలు కీలకంగా మారాయి. దీంతో గూడ్స్ రైళ్ల క్లియరెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ ప్యాసింజర్ రైళ్లను తరచుగా ఆపేస్తున్నారు. ఫలితంగా డోర్నకల్ - భద్రాచలంరోడ్ సెక్షన్‌లోకి రైలు వచ్చిన తర్వాత గమ్యస్థానం చేరే వరకు ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా సింగరేణి, కాకతీయ రైళ్లలో వచ్చే వారికి ఈ తరహా కష్టాలు ఎక్కువగా ఉన్నాయి.

54 కి.మీ. మేర ట్రాక్

డోర్నకల్ నుంచి భద్రాచలంరోడ్ వరకు మొత్తం 54 కి.మీ దూరం రైల్వే ట్రాక్ ఉంది. ఈ ట్రాక్‌కు సమాంతరంగా మరో ట్రాక్ నిర్మిస్తారు. అంతేకాకుండా మార్గమధ్యంలో పోచారం, కారేపల్లి, గాంధీపురం, చీమలపాడు, తడికలపూడి, బేతంపూడి స్టేషన్లలో లూప్‌లైన్ల నిర్మాణం కూడా చేపడతారు. ఇందులో చాలావరకు భూసేకరణ సైతం గతంలోనే పూర్తయింది. ఈ మేరకు ట్రాక్ వెంబడి హద్దు రాళ్లు సైతం ఉన్నాయి. ప్రస్తుత రైల్వే అంచనాల ప్రకారం కిలోమీటర్ ట్రాక్ నిర్మాణానికి రూ.90 నుంచి రూ.100 కోట్ల వరకు వ్యయం అవుతుంది. ఈ లెక్కన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 540 కోట్ల వరకు ఖర్చు కావచ్చని తెలుస్తోంది. రైల్వే బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినందున డీపీఆర్ తయారీ, టెండర్లు తదితర పనులన్నీ ముగిసే సరికి కనీసం ఆరు నెలల సమయం పట్టవచ్చు. ఆ తర్వాత నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

మరిన్ని రైళ్లకు అవకాశం..

కరోనాకు ముందు భద్రాచలం రోడ్ నుంచి డోర్నకల్ల మధ్య ఏడు రైళ్లు నడిచేవి. ప్రస్తుతం ఐదు రైళ్లు నడుస్తున్నాయి. సత్తుపల్లి మార్గం అందుబాటులోకి వచ్చాక గూడ్స్ ట్రాఫిక్ పెరిగిపోయింది. దీంతో కొత్త రైళ్లు నడిపించడం కష్టంగా మారింది. డబ్లింగ్ పనులు పూర్తయితే కనీసం కొత్తగూడెం నుంచి డోర్నకల్ మధ్య ప్రస్తుతం ఉన్న రైళ్లు ఆలస్యం కాకుండా నడిచేందుకు వీలవుతుంది. అదే విధంగా తిరుపతి, షిర్డీ, నిజామాబాద్, మంచిర్యాల, గుంటూరు తదితర పట్టణాలకు మరిన్ని రైళ్లు నడిపించేందుకు వీలవుతుంది.

భద్రాచలంరోడ్ కేంద్రంగా



రాబోయే రోజుల్లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో భద్రాచలంరోడ్ రైల్వే స్టేషన్ కీలకంగా మారనుంది. ఈ స్టేషన్‌ను కేంద్రంగా చేసుకుని ఇప్పటికే భద్రాచలం - మల్కనగిరి, మణుగూరు - రామగుండం, కొత్తగూడెం - కొండపల్లి, భద్రాచలం రోడ్ - కొవ్వూరు రైల్వేలైన్ల నిర్మాణ పనులు పరిశీలనలో ఉన్నాయి. రానురాను సరుకు రవాణాకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఇందులో ఒక్కో మార్గాన్ని తప్పకుండా నిర్మించాల్సిన పరిస్థితి రైల్వేశాఖకు ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ మార్గం నిర్మాణానికి సింగరేణి లేదా రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తే నిర్మిస్తామని రైల్వే శాఖ గతంలో ప్రకటించింది. కానీ అటువైపు నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా డోర్నకల్ నుంచి భద్రాచలంరోడ్ వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చాలని నిర్ణయించింది. బడ్జెట్ ప్రతిపాదనలతో సంబంధం లేకుండా దీన్ని ప్రత్యేక ప్రాజెక్టుగా 2023 జూన్ 21 రైల్వే శాఖ గుర్తించింది.

30న పోడు పట్టాల పంపిణీ

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడి



పువ్వాడ అజయ్‌కుమార్

చుంచుపల్లి: జిల్లాలో ఈనెల 30న గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు ఆసిఫాబాద్‌లో సీఎం కేసీఆర్ పట్టాల పంపిణీని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించే పట్టాల పంపిణీకి రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు. ఇతర జిల్లాల్లో కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పట్టాలు అందజేస్తారని వివరించారు. గతంలోనే దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తి చేసి అర్హులను గుర్తించిందని తెలిపారు. జిల్లాలో 1,51,195 ఎకరాలకు గాను 50,595 మంది గిరిజనులకు హక్కు పట్టాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాల పాటు పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ పట్టాల కోసం ఎదురు చూస్తున్న రైతుల కలను సీఎం కేసీఆర్ సాకారం చేశారని, రాష్ట్రంలోని పోడు రైతుల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

కంచే చేను మేసింది !

- ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లో అక్రమాలు
- జామాయిల్ కర్రను అమ్ముకున్న అటవీ అధికారులు
- ఫారెస్ట్ సెక్షన్, బీట్ అధికారుల సస్పెన్షన్

బూర్గంపాడు: ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లో కంచే చేను మేసింది. అడవిని రక్షించాల్సిన అధికారులే అక్రమాలకు తెరలేపారు. ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లో సాగుచేసిన జామాయిల్‌ను గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నారు. ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన ఫారెస్ట్ స్క్వాడ్‌కు స్థానిక అటవీ అధికారులు అడ్డంగా దొరికిపోయారు. దీంతో ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మరికొందరిపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

అశ్వాపురం అటవీ రేంజ్ పరిధిలోని ఇరవెండి బీట్‌లో ఐదారేళ్ల క్రితం యూకలిప్టస్(జామాయిల్) సాగు చేశారు. చెట్ల ఎదుగుదలకు అంతర్గత సేద్యం చేశారు. వేసవిలో మొక్కల సంరక్షణకు నీళ్లు పట్టారు. ప్రస్తుతం జామాయిల్ నరికేందుకు సిద్ధంగా ఉంది. ఈ తరుణంలో జామాయిల్ కర్రను ఐటీసీ పీఎస్‌పీడీకి గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకునేందుకు స్థానిక అటవీశాఖ అధికారులు పథకం వేశారు. ఇందుకోసం ఐటీసీ పీఎస్‌పీడీకి కర్ర సరఫరా చేసే కాంట్రాక్టర్లతో మంతనాలు చేశారు. ఎక్కువ ధర చెల్లించేవారికి కర్ర ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. పది రోజుల క్రితం ఇరవెండి అటవీ బీట్‌లోని జామాయిల్‌ను నరికించి రెండు ట్రాక్టర్లలో ఐటీసీ పీఎస్‌పీడీకి తరలించేందుకు సిద్ధమయ్యారు. ముందస్తు సమాచారం మేరకు ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన ఫారెస్ట్ స్క్వాడ్ జామాయిల్ కర్రను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న జామాయిల్ కర్రను భద్రాచలం కలప డిపోకు తరలించారు. ఈ వ్యవహారంపై అటవీశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ అక్రమ వ్యవహారానికి బాధ్యునిగా తొలుత ఇరవెండి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఈ వ్యవహారంలోనే అశ్వాపురం ఫారెస్ట్ సెక్షన్ అధికారిని కూడా సస్పెండ్ చేశారు. మరికొందరు అటవీశాఖ అధికారులపై కూడా చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఫారెస్ట్ అధికారులు జామాయిల్ కర్రను అక్రమంగా అమ్ముకునేందుకు ఐటీసీ పీఎస్‌పీడీకి చెందిన ఉడ్ కాంట్రాక్టర్లతో సాగించిన బేరసారాలతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. తొలుత బేరం కుదుర్చుకున్న కాంట్రాక్టర్లకు జామాయిల్ కర్ర ఇవ్వకుండా ఎక్కువ ధర చెల్లిస్తానన్న మరో కాంట్రాక్టర్‌కు కర్రను అమ్మడంతో ముందుగా మాట్లాడుకున్న కాంట్రాక్టర్లు అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అటవీశాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.

జిల్లాకు బీసీ గురుకుల డిగ్రీ కళాశాల

కొత్తగూడెంఅర్బన్: జిల్లాకు బీసీ గురుకుల కళాశాలను కేటాయిస్తూ ప్రభుత్వం గతంలో ఆమోదం తెలపగా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు కేటాయించిన కళాశాలలో పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నారు. 2023 - 24 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం అవుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఈడీ ఇంద్ర తెలిపారు.

విద్యుదుత్పత్తిలో దేశానికే ఆదర్శం

టీఎస్ జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు



ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీ డి.ప్రభాకర్ రావు అన్నారు. పాల్వంచ కేటీపీఎస్‌లో రూ. 8.50 కోట్లతో నిర్మించిన జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, సిమిలేటర్, హాస్టల్ భవనాలను, కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధించామని చెప్పారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా గొప్ప విషయమన్నారు. వివిధ రాష్ట్రాల వారు సైతం మన ప్రగతిని సమీక్షిస్తున్నారని అన్నారు. గతంలో 7,778 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉండగా పెరుగుతున్న అవసరాలను తీరుస్తూ మిగులు విద్యుత్ దిశగా కృషి చేసి ప్రస్తుతం 18వేల మెగావాట్లకు చేరుకోగలిగామని వివరించారు. సీఎం కేసీఆర్ సహకారం, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని చెప్పారు. జెన్‌కోలో పనిచేసే ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా అన్ని వసతులతో కూడిన ట్రైనింగ్ సెంటర్ నిర్మించామని, రోజుకు 100 మంది చొప్పున శిక్షణ తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వైటీపీఎస్ కర్మాగారం పనులు శరవేగంగా సాగుతున్నాయని, బొగ్గు కొరత లేదని అన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ టీఆర్‌కే.రావు, డైరెక్టర్లు లక్ష్మయ్య, అజయ్, సచ్చిదానందం, వెంకటరాజం, టెక్నికల్ సీఎండీ హనుమాన్, ఓఎస్డీ వినోద్‌కుమార్, సీఈలు ఎం.ప్రభాకర్ రావు, పి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు, నారాయణ, శ్రీనివాస్, ఎస్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ జంగయ్య, సీఐ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల్లో ప్రాపర్టీ డిపాజిట్ అమలు చేయాలని, పాత కేసులను త్వరితగతిన విచారించేందుకు సాక్షులను ప్రవేశపెట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎక్సైజ్ కేసుల్లో వారెంట్‌ను అమలు పరచాలని చెప్పారు. సమావేశంలో న్యాయమూర్తులు జి.భానుమతి, అడెపు నీరజ, బత్తుల రామారావు, ఎ.సుచరిత, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, టి.రమేష్, ఎం.అబ్బయ్య, భద్రాచలం జైలు సూపరింటెండెంట్ జె.ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు భద్రాద్రికి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోను సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ ఆదివారం సందర్శించనున్నారని డిపో మేనేజర్ బి.రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఆయన శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం డిపోలో ఉద్యోగులు, కార్మికులతో సమావేశం అవుతారని, సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమంపై చర్చిస్తారని తెలిపారు.

తొలకరి వర్షం.. రైతుల్లో హర్షం

- జిల్లాలో ప్రారంభమైన వానాకాలం వ్యవసాయ పనులు
- విత్తనాలు వేసుకోవచ్చని అధికారుల వెల్లడి
- జిల్లాలో సరాసరి 23.3 మి.మీ. వర్షపాతం



పాల్వంచ మండలం పునుకులలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతుల ఎదురుచూపులకు స్వస్తి చెబుతూ తొలకరి వర్షం వారిని పలకరించింది. నైరుతి రుతుపవనాల రాకతో జిల్లాలో వర్షం కురిసి రైతులతో పాటు ప్రజలనూ ఆహ్లాదపరిచింది. దీంతో ఇప్పటివరకు వానాకాలం వ్యవసాయ పనులు ప్రారంభించని రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. గత వానాకాలం కంటే ఈ ఏడాది పంట విస్తీర్ణం పెంచడమే కాక.. పంటలు కోత దశకు వచ్చే సమయంలో భారీ వర్షాలు కురిసి దెబ్బతింటున్న తరుణంలో ముందస్తుగా వానాకాలం సీజన్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ప్రయత్నాలు చేసినా వర్షాలు పడకపోవడంతో సాగు ఆలస్యంగానే ప్రారంభమవుతోంది. ప్రస్తుతం కురిసిన వర్షం విత్తనాలు వేసుకోవడానికి అనుకూలంగా ఉందని శనివారం అధికారులు ప్రకటనలు విడుదల చేశారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటిస్తుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జూన్‌లో ఇప్పటి వరకు 125.1 మి.మీ., వర్షపాతం నమోదు కావాల్సిండగా 44.9 మి.మీ. వర్షపాతమే నమోదైంది. అంటే 70.2 మి.మీ. లోటు వర్షపాతం ఉంది. మణుగూరు, కరకగూడెం, పినపాక మండలాల్లో ఇంకా వ్యవసాయ పనుల ప్రారంభానికి అవసరమైన వర్షపాతం నమోదు కాలేదు.

వర్షపాతం వివరాలిలా..

జిల్లా వ్యాప్తంగా శనివారం వర్షం కురిసింది. కరకగూడెం మండలంలో 1.4 మి.మీ, పినపాకలో 2.4, చర్లలో 1.8, దుమ్ముగూడెంలో 12.4, అశ్వాపురంలో 1.8, మణుగూరు మండలంలో 1.2, ఆళ్లపల్లిలో 24.8, గుండాలలో 12, ఇల్లెందు మండలంలో 34, టేకులపల్లిలో 32.4, జూలూరుపాడులో 9.6, చండ్రుగొండలో 23.2 అన్నపురెడ్డిపల్లిలో 18.2, చుంచుపల్లిలో 45.4, సుజాతనగర్‌లో 32.2, కొత్తగూడెంలో 62, లక్ష్మీదేవిపల్లిలో 52.4, పాల్వంచ మండలంలో 28.2, బూర్గంపాడులో 27.6, భద్రాచలంలో 13.6, ములకలపల్లిలో 60.2, దమ్మపేటలో 15.6, అశ్వారావుపేట మండలంలో 22.4 మి.మీ. వర్షం కురిసింది. జిల్లా మొత్తం సరాసరి 23.3 మి.మీ.గా నమోదైంది.

ఇప్పటికే 10,688 ఎకరాల్లో..

ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం 10,688 ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. వర్షాధారంగా కాకుండా నీటివనరులు ఉన్న ప్రాంతాల్లో 644 ఎకరాల్లో వరినారు పోశారు. 8,916 ఎకరాల్లో పత్తి, 1,128 ఎకరాల్లో పచ్చిరొట్ట సాగు చేశారు.

సంతోషంగా ఉంది



ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యాయి. ఇప్పటికైనా వర్షాలు ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. గత వానాకాలం కూడా వర్షాభావంతో ఇబ్బందులను ఎదుర్కొన్నాం. ఈసారి వ్యవసాయానికి అనుకూలంగా వర్షాలు పడాలని కోరుకుంటున్నాం.

– ఎస్.రామిరెడ్డి, రైతు, రెడ్డిగూడెం

వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి



జిల్లాలో వానాకాలం వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. వరి, పచ్చిరొట్ట, పత్తి విత్తనాలు వేశారు. విత్తనాలకు సరిపడా వర్షపాతం నమోదైనందున సాగు పనులు చేసుకోవచ్చు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

పర్ణశాలలో ఛత్తీస్‌గఢ్ మాజీ ఎంపీ పూజలు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాజీ ఎంపీ శనివారం దర్శించుకున్నారు. ముందుగా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎంపీ ప్రత్యేక పూజలను నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ప్రతినిధులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విదేశీ ఉద్యోగ మేళాకు భారీ స్పందన లభించింది. జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లో ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూలకు ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన నిరుద్యోగులు హాజరయ్యారు. ఉపాధికల్పనా శాఖ అనుబంధ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించారు. 856 మంది హాజరు కాగా 428 మంది తర్వాత దశ ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. వీరికి జర్మనీ, ఆస్ట్రేలియాకు చెందిన యాజమాన్యాలతో వీడియో కాలింగ్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది జాఫర్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రతినిధులు శ్రావణి, సందీప్, ఉపాధి కల్పన శాఖ సిబ్బంది యాకయ్య, రామయ్య, షఫీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు పొడిగింపు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) రైల్వే స్టేషన్ నుంచి వెళ్లి, వచ్చే పలు రైళ్ల రద్దును పొడిగించినట్లు బీడీసీఆర్ రైల్వే స్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్, ట్రాక్ పనుల కారణంతో ఈ నెల 25వ తేదీ వరకు రైళ్లను రద్దు చేసిన విషయం విదితమే. విజయవాడ నుంచి కొత్తగూడెం రాకపోకలు సాగించే రైళ్లను, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వచ్చే రైలును, కొత్తగూడెం నుంచి బల్లార్షాకు వెళ్లే రైలును వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

రేపు స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియాలోని గౌతంపూర్ స్విమ్మింగ్ పూల్‌లో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో స్విమ్మింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ట్రియాతలాన్ అసోసియేషన్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం అండర్-16, అండర్-17, అండర్-17 విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైనవారిని ఈ నెల 29న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

పాల్వంచ: పట్టణంలో శనివారం పలు దుకాణాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. శాస్త్రి రోడ్‌లోని స్వీట్ షాపును, అంబేద్కర్ సెంటర్‌లోని రెండు సూపర్ మార్కెట్లలో తనిఖీలు చేసి, శాంపిల్స్ సేకరించారు. శాంపిల్స్‌కు ల్యాబ్‌కు పంపించామని, రిపోర్ట్ ఆధారంగా జరిమానా విధిస్తామని తెలిపారు. తనిఖీల్లో డీఓ మణికంఠ రెడ్డి, అసిస్టెంట్ దస్తగిరి ఉన్నారు.

రేపటి నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 26వ తేదీ నుంచి ఎంసెట్ (ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ) కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి.నాగముని నాయక్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల నమోదు(స్లాట్ బుకింగ్) ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 26వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు మూడు విడతలుగా కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని, మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని వివరించారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, ఈ నెల 28నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే 8న సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు 12నుంచి 19వ తేదీ వరకు కళాశాలలో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు వచ్చే నెల 21నుంచి 22వరకు స్లాట్ బుకింగ్, 23వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన, 21నుంచి 24వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే 28న సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. 28నుంచి 31వ తేదీ వరకు ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇక చివరి దశ కౌన్సెలింగ్‌కు ఆగస్టు 2న స్లాట్ బుకింగ్, 3వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన, 2నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇస్తారని, ఆగస్టు 7న సీట్ల కేటాయింపు ప్రకటిస్తే విద్యార్థులు 9వ తేదీలోగా ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని వివరించారు.

ఠాణాల నిర్మాణంలో జాప్యం

నత్తనడకన పోలీస్ స్టేషన్ల భవనాల పనులు

- మూడేళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు



ఇంటీరియర్ పనులు పూర్తికాని చుంచుపల్లి పోలీస్ స్టేషన్ భవనం

కొత్తగూడెంటౌన్: జిల్లాలో నూతన పోలీసు స్టేషన్ల నిర్మాణాలు మూడేళ్లయినా పూర్తికాలేదు. పనులు నత్తనడకన సాగుతుండటంతో మరింత జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తికాగా ఇంటీరియర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 28 పోలీసు స్టేషన్లు ఉండగా, వాటిలో రెండు లా అండ్ ఆర్డర్, రెండు ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో నూతనంగా పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు 2020లో నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా మండలాలకు పోలీసు స్టేషన్లు మంజూరు చేసింది. కొత్త మండలాల్లో భవనాలు లేకపోవడంతో సింగరేణి, ప్రభుత్వ భవనాల్లో ఠాణాలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల్లో స్టేషన్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో కొత్త మండలాలతో కలిపి ప్రభుత్వం జిల్లాలో 9 పోలీస్ స్టేషన్ల భవనాల నిర్మాణం చేపట్టింది. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, పాల్వంచరూరల్, దుమ్ముగూడెం, ఏడూళ్లబయ్యారం, బూర్గంపాడు, చర్ల, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్ ప్రాంతాలో.. ఒక్కో స్టేషన్ భవన నిర్మాణానికి రూ.2.50 కోట్ల చొప్పున నిధులు కేటాయించింది. 2020లో నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. మూడేళ్లు గడుస్తున్నా ఇంకా పోలీస్ స్టేషన్ భవనాలు అందుబాటులోకి రాలేదు. కొన్నింటి నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలోనే ఉన్నాయి. మరోవైపు సౌకర్యాలులేని భవనాల్లో పోలీసు స్టేషన్లు కొనసాగుతున్నాయి. దీంతో పోలీసు సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతోనే నిర్మాణ పనుల్లో ఆలస్యమవుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్లలో సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు అంతా కలిపి సుమారు 1,450 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎనిమిది మందిపై అరెస్ట్ వారెంట్లు

అశ్వాపురం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో పోలీసులు ఎనిమిది మందిపై శనివారం అరెస్ట్ వారెంట్లు జారీ చేశారు. మండల కేంద్రానికి చెందిన రమేష్ అనే వ్యక్తిని కోర్టులో రిమాండ్ చేసినట్లు అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గతేడాది జూన్ 28న అశ్వాపురం పీఏసీఎస్ కార్యాలయంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో పాయం సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ముత్తినేని వాసు, ప్రకాష్, రమేష్, నాగేశ్వరరావు, మురళి, భాస్కర్, గణేష్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ ఎనిమిది మందికి అరెస్ట్ వారెంట్లు జారీ చేసి అందులో ఒకరిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఇదే కేసులో గతేడాది జూన్ 28న తుళ్లూరి బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు పాయం సత్యనారాయణ, ఊకె సతీష్, భూషెట్టి నరేష్‌తో పాటు మరో ఎనిమిది మందిపై కూడా కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావును వివరణ కోరగా.. ఎనిమిది మందికి అరెస్ట్ వారెంట్లు జారీ చేసి, అందులో ఒకరిని కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు.

తునికాకు బోనస్ రాలేదని ఆందోళన



అటవీశాఖ రేంజ్ కార్యాలయం వద్ద కూలీలు

ఇల్లెందురూరల్: తునికాకు బోనస్ డబ్బులు తమకు అందలేదంటూ పలువురు కూలీలు శనివారం కొమరారం అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. 2016 నుంచి 2021 వరకు తునికాకు సేకరించిన కూలీలకు అటవీశాఖ ద్వారా బోనస్ డబ్బులను కూలీల అకౌంట్లలో జమచేస్తున్నారు. కొందరు అకౌంట్లలో జమకాకపోవడంతో శనివారం కొమరారం అటవీశాఖ రేంజ్ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులను ప్రశ్నించారు. దీంతో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులకు తమ బ్యాంకు అకౌంట్ నంబర్లు ఇచ్చే సమయంలో కొందరు చేసిన తప్పిదాల వల్ల బోనస్ జమకాలేదని తెలిపారు. బోనస్ రానివారు గతంలో అందజేసిన బ్యాంకు అకౌంట్ సరిచేసుకుని, మరోసారి వివరాలు అందించాలని సూచించారు.

భూవివాదంలో ఇద్దరిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భూ వివాదంలో దాడి చేసిన ఇద్దరిపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. భూ వివాదంలో మండలంలోని గుర్రాల చెరువుకు చెందిన తానికొండ రవి కుమార్‌పై అతని అన్నయ్య పెద్ద రామకృష్ణ, వదిన వెంకటలక్ష్మీ తులసీ కుమారి గొడవ పడి, దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై..

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ ఆటో డ్రైవర్‌పై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం గంపలగూడేనికి చెందిన ఎనిమిది మంది యువకులు ఈ నెల 20న అశ్వారావుపేట మండలం సరిహద్దులో ఉన్న శ్రీ గుబ్బల మంగమ్మ ఆలయానికి వచ్చారు. ఆటోలో తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో స్థానిక పట్టు పరిశ్రమ కేంద్రం వద్ద ఆగి ఉన్న ఓ మినీ వ్యాన్‌ను వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఆటో ఉన్న వారంతా గాయపడ్డారు. గాయపడిన వారిలో సాయి కిరణ్ అనే బాధితుడి తండ్రి తరిగొప్పుల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని రైటర్‌బస్తీలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండగా, 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు 87126 82017 నంబరులో సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

వైన్‌షాపులో లిక్కర్ చోరీ

- లక్ష్మీపురంలో రూ.3.39 లక్షల మద్యం బాటిళ్లు అపహరణ
- మూడు నెలల క్రితం ఇదే దుకాణంలో చోరీ



చోరీ జరిగిన వైన్‌షాపు

బూర్గంపాడు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న లక్ష్మీభవాని వైన్‌షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. 54 కేస్‌ల మద్యం బాటిళ్లను దొంగలు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.3.39 లక్షల వరకు ఉంటుంది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు వైన్‌షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి, పైకి లేపి, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి లిక్కర్ బాటిళ్ల కేస్‌లను ఎత్తుకెళ్లారు. వైన్‌షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మీపురంలో వైన్‌షాపు వీధిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ వాహనంలో కొందరు వ్యక్తులు అటుగా వచ్చినట్లు ఓ ఇంటి ముందున్న సీసీ కెమెరాల్లో రికార్డయింది. సీసీ కెమెరాల ఫుటేజీతోపాటుగా కొందరు అనుమానితులను కూడా పోలీసులు విచారిస్తున్నారు. మూడు నెలల క్రితం కూడా ఇదే వైన్‌షాపులో మద్యం చోరీ చేశారు. గత నెలలో సారపాకలోని సాయిభవాని వైన్‌షాపులో రూ.2.70 లక్షల విలువైన 36 కేస్‌ల మద్యం బాటిళ్లను తీసుకెళ్లారు. ఈ ఘటనలను పరిశీలిస్తే పథకం ప్రకారం చోరీ చేస్తున్నట్లు అర్థమవుతోంది. గతంలో జరిగిన రెండు ఘటనలపై ఇంకా పోలీసుల విచారణ జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి లిక్కర్ చోరీ జరగడంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లెందులో ఆటో..

ఇల్లెందు: పట్టణంలో శనివారం ఆటో చోరీకి గురైంది. స్థానిక సివిల్ లైన్‌కు చెందిన బి.సతీష్ శనివారం ఉదయం ఆటో కిరాయికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు నిలిపి భోజనం చేసి వచ్చేసరికే ఆటో కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ టి.కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఆటో విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పాల్వంచలో..

పాల్వంచ: ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని మంచికంటి నగర్‌కు చెందిన మాలోతు రమేశ్ శుక్రవారం రాత్రి తన ఆటోను ఇంటి ముందు ఉంచి నిద్రించాడు. శనివారం ఉదయం చూడగా ఆటో కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఆ ఏరియాలో సీసీ కెమెరాలు పనిచేయక పోవడం గమనార్హం.

ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం: పర్ణశాల గ్రామపంచాయతీ పెద్ద బండిరేవు గ్రామానికి చెందిన సోయం రాజమ్మ పూరిల్లు శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోయింది. వ్యవసాయ భూమి పట్టాలు, ఇటీవల వచ్చిన బోనస్ డబ్బులు, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు సహా అన్ని కాలిపోయాయి.

సెప్టిక్ ట్యాంక్‌లో పడిన గేదె

రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



క్రేన్‌తో గేదెను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సీపీఐ ఆఫీసు పక్కన మార్కెట్ యార్డ్ గోడను ఆనుకొని ఉన్న ఖాళీ ప్రదేశంలో శనివారం మేతకు వచ్చిన పాడి గేదె సెప్టిక్ ట్యాంక్‌లో పడిపోయింది. గమనించిన స్థానికులు నాయుడు, ఉదయ్‌కుమార్ సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. క్రేన్‌ను తెప్పించి గేదెకు బెల్ట్‌లు వేసి బయటకు తీశారు. కాగా ట్యాంక్‌లో ఉన్నప్పుడే వెటర్నరీ అధికారి గేదెకు వైద్యం అందించారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు, పంచాయతీ సిబ్బంది జి.శ్రీనివాస్, బి.సతీష్, ఎస్కే సలీమ్, ఎస్.కిరణ్, పి.రమేష్, పి.నరేష్, రమేష్ పాల్గొన్నారు.

రెండు దుక్కిటెడ్లు మృతి



అశ్వారావుపేటరూరల్: గిరిజన రైతుకు చెందిన రెండు దుక్కిటెడ్లు శనివారం రాత్రి మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం సమీపంలో ఉన్న ఎర్రగుంటపల్లికి చెందిన రైతు తెల్లం మహేష్ దుక్కిటెడ్లు రెండు మేతకు వెళ్లి తిరిగి రాలేదు. రైతు వెతికి ఇంటికి తోలుకెళ్తుండగా మార్గంమధ్యలో ఒక్కసారిగా కిందపడిపోయి మృతి చెందాయి. మేతకు వెళ్లిన సమయంలో ఏదైనా పురుగుల మందు కలిసిన నీళ్లు తాగి మృతి చెందాయా.? ఇతర కారణాలు ఉన్నాయా? అనే విషయం తెలియాల్సి ఉంది. కళ్లేదుటే దుక్కిటెడ్లు మృత్యువాత పడటంతో రైతు లబోదిబోమంటున్నాడు.

భద్రాద్రి డీపీఆర్ఓ కుటుంబానికి పలువురి పరామర్శ



సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీహెచ్ శ్రీనివాసరావు

కల్లూరు: భద్రాద్రి కొత్తగూడెం డీపీఆర్ఓ శీలం శ్రీనివాసరావు తల్లి సరస్వతి ఇటీవల మరణించగా శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామమైన కల్లూరు అంబేద్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారులు, వివిధ పార్టీల నాయకలు పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు శ్రీనివాసరావు, కుటుంబీకులను పరామర్శించారు. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, భద్రాద్రి డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, డీసీఓ వెంకటేశ్వర్లు, సంక్షేమ శాఖ అధికారి సబిత, డీఆర్ఓ అశోక్ చక్రవర్తితో పాటు వివిధ పార్టీల నాయకులు, అధికారులు సంభాని చంద్రశేఖర్, నాగా సీతారాములు, డాక్టర్ లక్కినేని రఘు, రవికుమార్, రావిరాల రాంబాబు, గడల లక్ష్మణరావు, వలసాల వీరభద్రం, ఊడల మధుకర్, ఎం.డీ.మౌలాలి, పి.సత్యవాణి, షేక్ జానీమియా, పాలంకి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్‌పై 27న టెలీ కాన్ఫరెన్స్

కొత్తగూడెంఅర్బన్: ఇన్‌స్పైర్ మనాక్-2023-24కు సంబంధించిన అంశాలపై జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఈ నెల 27న హైదరాబాద్ నుంచి టీశాట్ ద్వారా టెలీ కాన్ఫరెన్స్ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులందరూ ఈ కార్యక్రమం వీక్షించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. టీ శాట్ కార్యక్రమాల్లో బ్రిగేడియర్ గణేశం, డాక్టర్ సురేష్‌బాబు పాల్గొంటారని, నూతన ఆలోచనలు, పరిశోధన విధానాలు, స్థానిక వనరుల వినియోగం, లోకాస్టు-నోకాస్టు తదితర అంశాలపై వివరిస్తారని తెలిపారు. ప్రతి పాఠశాలలో టీశాట్ ద్వారా, మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని తప్పనిసరిగా విద్యార్థులు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డీఎస్ఓ చలపతిరాజు 92472 96012 నంబరులో సంప్రదించాలని కోరారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఎంఎస్ ఆనంద్‌వేల్

మణుగూరు రూరల్: గనుల్లో నిరంతరం రక్షణ చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ రీజియన్-1 డీఎంఎస్ (ఎలక్ట్రికల్) ఎస్.ఆనంద్‌వేల్ సూచించారు. శనివారం ఆయన సింగరేణి మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిని సందర్శించారు. ఉపరితల, భూగర్భ సబ్ స్టేషన్లను, విద్యుత్ పరికరాలను పరిశీలించారు. రక్షణ చర్యలపై ఆరా తీశారు. అనంతరం గని అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సలహాలు ఇచ్చారు. గనిలో రక్షణచర్యలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపడుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు జి నాగేశ్వరరావు, వెంకటరమణ, నర్సిరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, మధుబాబు, విజయ్‌పాల్, సర్వర్ నబీ, సీవీ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

మణుగూరు రూరల్ : కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేయకుండా సింగరేణి యాజమాన్యం కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు పేర్కొన్నారు. శనివారం మణుగూరులో పలు సింగరేణి విభాగాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సింగరేణి లాభాల్లో పయనించేందుకు భాగస్వాములైన కాంట్రాక్ట్ కార్మికుల వేతన చెల్లింపులో వివక్ష చూపడం సరికాదని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వచ్చే నెల 7,14,15,21,22వ తేదీల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు శ్రీనివాసరావు, ఉప్పుతల నరసింహారావు, కృష్ణయ్య, రవి, మాధవరావు, లక్ష్మి, అమృతరావు, రాంబాబు, వీరస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలో పనిచేసుకుంటున్న దంపతులపై భౌతిక దాడికి పాల్పడిన ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన గుర్రం మంగ, తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి నల్లకుంట గ్రామ శివారులో తన తండ్రి ఇచ్చిన వ్యవసాయ భూమిని సాగు చేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 21న దంపతులు వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా, మంగ తండ్రి బడుగు ముత్యాలరావు అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు భౌతిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

బూర్గంపాడు: మండల పరిధిలోని నకిరిపేటలో వీధి కుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ఐదేళ్ల కేలోత్ వరుణ్‌జోషి శనివారం సాయంత్రం ఇంటి ముందు తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో నాలుగు వీధి కుక్కలు అరుస్తూ దాడికి పాల్పడ్డాయి. పిల్లలు పరుగెడుతున్నా వెంటపడి కరిచాయి. దీంతో వరుణ్‌జోషికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి తరిమివేయడంతో బాలుడు గాయాలతో బయటపడ్డాడు. పొట్టభాగంలో, వీపు భాగంలో గాయాలుకాగా, కుటుంబ సభ్యులు మోరంపల్లిబంజర పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యసేవలను అందిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఆందోళన చేస్తామని పేర్కొంటున్నారు.

కంటి నిండా నిద్ర కరువు



40 ఏళ్లు పైబడిన వారిని వేధిస్తున్న నిద్ర లేమి

- ఏజ్ వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి
- 5 వేల మందిపై సర్వే
- కనీసం 6 గంటలు నిద్ర పోలేకపోతున్నట్టు 70 శాతం మంది వెల్లడి
- నిద్ర లేమితో బాధపడుతున్న వారిలో పురుషులే అధికం

సాక్షి, అమరావతి: మారిన జీవన విధానాలు, చుట్టుముడుతున్న ఆర్థిక, కుటుంబ సమస్యల నడుమ మధ్య వయస్కులు, వృద్ధుల్లో కంటి నిండా నిద్ర కరవు అవుతోంది. ముఖ్యంగా మధ్య వయస్కులు పగలంతా కష్టం చేసి రాత్రి అయ్యాక కంటి నిండా నిద్రపోవడం ఒక కలగా మారుతోంది. ఏజ్‌వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 40 నుంచి 64 ఏళ్ల, 65 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇలా రెండు వర్గాలుగా మే నెలలో దేశవ్యాప్తంగా 5 వేల మంది నుంచి ఫౌండేషన్ వివరాలు సేకరించింది. వీరిలో 40 నుంచి 64 ఏళ్ల వారు 2245 (పురుషులు 1102, మహిళలు 143)మంది, 65 ఏళ్ల పైబడిన వారు 2,755 (పురుషులు 1,336, మహిళలు 1,419) మంది ఉన్నారు.

6 గంటలు కూడా నిద్రపోలేకున్నాం

70 శాతం మంది రోజులో కనీసం ఆరు గంటలు కూడా కంటి నిండా నిద్ర పోలేకపోతున్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది. 24 శాతం మంది మాత్రం 7 నుంచి 8 గంటలు, 6 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. మధ్య వయస్కుల్లో 60 శాతం ఆరు గంటలలోపు, 31 శాతం 7 నుంచి 8 గంటలు, 9 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నామన్నారు. అదే వృద్ధుల్లో 78 శాతం మంది ఆరు గంటల్లోపు, 19 శాతం మంది 7 నుంచి 8 గంటలు, 3 శాతం మంది 8 గంటలకు పైగా నిద్ర పోతున్నట్టు వెల్లడైంది.

ఆర్థిక ఇబ్బందులు ప్రధాన కారణం

నిద్ర లేమికి ప్రధాన కారణం ఆర్థిక పరమైన అంశాలేనని సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య లేకపోవడం, ఇతర కలహాలు కారణమని పేర్కొంది. యాంత్రిక జీవనం, మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, మద్యం సేవించడం, ఇతర సమస్యలతో సరైన నిద్ర ఉండటంలేదని కూడా ఫౌండేషన్ తెలిపింది. వయోభారం రీత్యా చుట్టుముట్టిన ఆరోగ్య సమస్యలు, ఒంటరి జీవనం నిద్రలేమికి కారణంగా వృద్ధులు పేర్కొన్నారు.

ఇలా చేయండి.. నిద్ర పడుతుంది

సర్వేలో భాగంగా నిద్ర లేమి సమస్య నివారణకు పలు సలహాలు, సూచనలు కూడా ఫౌండేషన్ తెలియజేసింది. అవి..

- నిద్రకు ఉపక్రమించే 4 గంటల ముందు నుంచి కాఫీ, టీలు తాగకూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు. వేడి పాలను తాగాలి
- ఆందోళన, ఒత్తిడి, నిరాశ నిద్రకు పెద్ద అవరోధం. వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవాలి
- పగటిపూట నిద్ర మానుకోవాలి
- టీవీ, సెల్ ఫోన్ చూడకూడదు
- పడక గదిలో స్లీప్ ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా చూసుకోవాలి

పురుషులే అధికం

నిద్రలేమితో సతమతం అవుతున్న వారిలో పురుషులే అధికం. పురుషుల్లో 81 శాతం మంది కనీసం ఆరు గంటలు కూడా నిద్రపోలేకపోతున్నామని వెల్లడించారు. అదే మహిళల



విషయానికి వస్తే 60 శాతం మంది ఆరు గంటలలోపు నిద్రపోతున్నామని చెప్పారు. మరో 15% మంది పురుషులు, 32% మంది మహిళలు 7 నుంచి 8 గంటలు, 4% పురుషులు, 8 శాతం మహిళలు 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. సర్వేలో పాల్గొన్న మొత్తం వ్యక్తుల్లో 55.08% మంది ప్రస్తుతం నిద్ర విధానంతో అసంతృప్తిగా ఉన్నామని తెలిపారు.

చిక్కిన చిరుత

- తల్లి చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు
- నడక మార్గంలో యథావిధిగా భక్తులకు అనుమతి
- అలిపిరి–తిరుమల మధ్య ఫెన్సింగ్ ఏర్పాటు వీలుకాదు
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుమల నడక దారిలో పట్టుబడిన చిరుత

తిరుమల: అలిపిరి–తిరుమల మార్గంలో బాలుడిపై దాడికి పాల్పడిన చిరుత అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. శేషాచలం అటవీ ప్రాంతంలోని 7వ మైలు వద్ద రెండు ప్రదేశాల్లో రెండు బోన్లు పెట్టగా.. ఒక దానిలో శుక్రవారం రాత్రి 10.45 గంటలకు చిరుత చిక్కిందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఆ చిరుతను టీటీడీ ఈవో అటవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురువారం రాత్రి అలిపిరి నడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేసిందని తెలియగానే దానిని పట్టుకోవాలని నిర్ణయించామన్నారు. చిరుత వయసు ఏడాదిన్నర ఉంటుందని, అది పిల్లిని తరుముకుంటూ వచ్చి అవగాహన లేక పిల్లాడిని తీసుకెళ్లినట్టుగా గుర్తించామని అన్నారు.

చిరుతలు మనుషులపై దాడి చేయవు

చిన్న చిరుత కావడం వల్ల వేటపై అవగాహన లేక ఈ ఘటన చోటుచేసుకున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. చిరుతలు మనుషులపై దాడి చేయవన్నారు. చిరుతను బంధించేందుకు రెండు ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేసి 150 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చామని తెలిపారు. శుక్రవారం రాత్రి 10.45 గంటలకు బోనులో చిరుత పడినట్టు సమాచారం వచ్చిందన్నారు. పట్టుబడిన చిరుతను 50 కిలోమీటర్ల అవతల అటవీ ప్రాంతంలో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తల్లి చిరుత కూడా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని, దానిని కూడా పట్టుకుంటామని చెప్పారు. శుక్రవారమే తల్లి చిరుత పట్టుబడేదని.. అయితే తగినంత ఆహారం దొరకడంతో అది రాలేదని గుర్తించామన్నారు. త్వరలోనే దాన్ని పట్టుకుని దూరంగా విడిచి పెట్టి భక్తుల్లో ఉన్న భయాందోళనలు తొలగిస్తామన్నారు.

నడక మార్గంలో వచ్చే భక్తులను ఆపబోం

చిరుత దాడి నేపథ్యంలో అలిపిరి–తిరుమల నడక మార్గాన్ని మూసివేస్తున్నట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్పష్టం చేశారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదన్నారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు గాలి గోపురం నుంచి నరసింహస్వామి ఆలయం వరకు 200 మంది భక్తులకు ఒక సెక్యూరిటీ గార్డు చొప్పున కేటాయింపు ఒక గుంపుగా పంపుతున్నామని తెలిపారు. నడక మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారన్నారు. జంతువులు తిరిగే అటవీ ప్రాంతంలో వాటి స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించకూడదని, అటవీ శాఖ నిబంధనల మేరకే వ్యవహరించాలని స్పష్టం చేశారు.

తిరుమలలో ఆగస్టు, సెప్టెంబర్ గదుల కోటా 26న విడుదల

తిరుమల: శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల కోటాను విడు దల చేస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన గదుల కోటాను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతి, తలకోన ప్రాంతాల్లోని గదులను భక్తులు https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు.

29న శ్రీశైలంలో సహస్ర ఘటాభిషేకం

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రం సస్యశ్యామలం కావాలనే సంకల్పంతో ఈ నెల 29న శ్రీశైల మహాక్షేత్రంలో మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లవన్న శనివారం తెలిపారు. తొలి ఏకాదశి రోజున మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం చేస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రుద్రపారాయణ, విరాటపర్వ పారాయణ, వారుణానువాక పారాయణ, కాశక పారాయణ, పంచాక్షరీజపం, రుష్యశృంగ, వరుణ జపాలు చేపడతామన్నారు.

ప్రీమియం రైళ్ల స్థానంలో 'వందేభారత్'

- శతాబ్ది స్థానంలో ప్రస్తుత చైర్‌కార్ రైళ్ల వినియోగం
- వచ్చే మార్చి నుంచి రానున్న వందేభారత్ స్లీపర్
- రాజధాని స్థానంలో వాటిని నడిపే యోచన



సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వేలో ప్రీమియం కేటగిరీ రైళ్లుగా గుర్తింపు పొంది, దశాబ్దాలుగా విజయవంతంగా నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు త్వరలో కనుమరుగు కాబోతున్నాయి. కొత్తగా ప్రారంభమై సూపర్ సక్సెస్ అయిన వందేభారత్ రైళ్లను వాటి స్థానంలో నడపాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రస్తుతం పగటి వేళ నడుస్తున్న చైర్‌కార్ కోచ్‌లతో కూడిన రెగ్యులర్ వందేభారత్ రైళ్లు శతాబ్ది స్థానాన్ని ఆక్రమించనున్నాయి. వచ్చే ఏడాది మార్చిలో అందుబాటులోకి రానున్న వందేభారత్ స్లీపర్ రైళ్లను రాజధాని స్థానంలో నడపాలని ప్లాన్ చేస్తోంది. దీంతో ప్రస్తుతం నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు దశలవారీగా మాయం కానున్నాయి.

అదే వేగంతో..

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల మధ్య వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తున్నారు. వీలైనంత తొందరలో 400 వందేభారత్ రైళ్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే శాఖ వాటి తయారీపై దృష్టి సారించింది. చైర్‌కార్ కోచ్‌లతో ఉన్నందున వీటిని రాత్రి వేళ నడిపే వీలు లేదు. దీంతో ఉదయం నుంచి అర్ధరాత్రి లోపు గమ్యం చేరి, మళ్లీ సొంత స్టేషన్‌కు తిరిగి వచ్చేలా సమయాలను సెట్ చేశారు. ప్రస్తుతం శతాబ్ది రైళ్లు కూడా ఇదే తరహాలో చైర్‌కార్ కోచ్‌లతో పగటి వేళ నడుస్తున్నాయి. భారత తొలి ప్రధాని నెహ్రూ శతజయంతికి గుర్తుగా శతాబ్ది (వందేళ్లు) పేరుతో 1988లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ప్రారంభించింది.

వచ్చే మార్చికి స్లీపర్ రైళ్లు..

తక్కువ దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య తిరుగుతున్న వందేభారత్ రైళ్లను దూర ప్రాంతాల మధ్యా ప్రవేశపెట్టాలని రైల్వే నిర్ణయించింది. ఇందుకోసం వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీనికి సంబంధించిన డిజైన్లు సిద్ధమవుతున్నాయి. వచ్చే మార్చి నాటికి తొలి రైలు పట్టాలెక్కించనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాజధాని నగరం ఢిల్లీకి, దేశంలోని ప్రధాన నగరాలకు మధ్య అనుసంధానంగా ఉన్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్థానంలో వీటిని నడపాలని భావిస్తోంది. 1969లో ఢిల్లీ–హౌరా మధ్య తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ప్రస్తుతం 18 రాజధాని రైళ్లు తిరుగుతున్నాయి. రాజధానిని తేజస్ రైళ్లుగా మార్చాలని నిర్ణయించి, తేజస్ రాజధాని పేరుతో ఏడు రైళ్లను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించింది. తాజాగా వాటి స్థానంలో వందేభారత్ స్లీపర్ కోచ్‌లను నడపాలని భావిస్తోంది.

అత్తను నరికిన అల్లుడు

- అక్కడికక్కడే మృతి చెందిన అత్త
- విజయవాడలో ఘాతుకం




నాగమణి (ఫైల్)

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): అత్తను ఆమె అల్లుడే కత్తితో దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన విజయవాడ కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నైనవరం ఫ్లై ఓవర్‌పై శనివారం రాత్రి చోటుచేసుకుంది. మామను కూడా చంపేందుకు ప్రయత్నించగా.. వేగంగా బైక్ నడిపి తప్పించుకోగలిగాడు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన గోగుల నాగమణి (50), గురుస్వామి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం కాగా, రెండో కుమార్తె లలితను ఏకలవ్యనగర్‌కు చెందిన కుంభా రాజేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా రాజేశ్, లలిత మధ్య గొడవలు జరగడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. అప్పటి నుంచి లలిత పుట్టింట్లోనే ఉంటోంది. విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేయగా కేసు చివరి దశలో ఉంది. ఈ క్రమంలో రాజేశ్ తన అత్త, మామలను చంపేందుకు ప్లాన్ చేశాడు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి సాయిరాం థియేటర్ వద్ద ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి నాగమణి, గురుస్వామి బైక్‌పై బయలుదేరారు. వారి బైక్‌ను ఇంటి నుంచే రాజేశ్ మరో వ్యక్తితో కలిసి మరో బైక్‌పై వెంబడించాడు. నైనవరం ఫ్లై ఓవర్ మధ్యన ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి బైక్ వెనుక కూర్చున్న రాజేశ్ అత్త నాగమణిపై కత్తితో వేటు వేశాడు. భుజంపై కత్తి వేటుపడగా.. నాగమణి పెద్దగా కేకలు వేస్తూ కిందపడిపోయింది. దీంతో ఆమె మెడపై కత్తితో నరికాడు. అదే సమయంలో బైక్‌పై ఉన్న గురుస్వామి భయంతో వేగంగా అక్కడి నుంచి వెళ్లి తప్పించుకున్నాడు. కాగా, రక్తం మడుగులో పడి ఉన్న నాగమణి కొద్దిసేపు గాయాలతో విలవిల్లాడి ఘటనాస్థలంలోనే మృతిచెందింది.

జిల్లా వార్తలు

అంతరాయం లేకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా




సర్వే ప్లాన్‌ను పరిశీలిస్తున్న జీఎం షాలెంరాజు

సత్తుపల్లిరూరల్: నిర్దేశిత లక్ష్యం మేరకు అంతరాయం లేకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేపట్టాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజు ఆదేశించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, ఓవర్ బర్డెన్, రక్షణ చర్యలపై సమీక్షించారు. ఈ మేరకు సర్వే ప్లాన్‌ను పరిశీలించిన జీఎం.. ఉత్పత్తి అయిన బొగ్గును రవాణా చేయటంలో అంతరాయాలు తొలగించాలని, ఓవర్ బర్డెన్ లక్ష్యాలను చేరుకునేలా కాంట్రాక్టర్లతో చర్చించాలని సూచించారు. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావుతో పాటు అధికారులు రమణారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఏఈ సివిల్ రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ సివిల్ (ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టుల భర్తీకి వంద మంది దరఖాస్తు చేసుకోగా స్క్రూటినీ అనంతరం 94 మందికి హాల్ టికెట్లు జారీ చేశామని తెలిపారు.

జాతీయ ఉషూ టోర్నీకి నలుగురి ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయస్థాయి సీనియర్ ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు ఖమ్మానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆర్.రవీందర్, పి.పవిత్రాచారి, యు.అనసీయ, పి.సత్యజిత్‌చారి ఈ నెల 26 నుంచి జూలై 1వ తేదీ వరకు మహారాష్ట్రలోని పుణేలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తదితరులు శనివారం అభినందించారు.

విద్యుత్ అంతరాయంతోనే ఇక్కట్లు

- మిషన్ భగీరథ'లో సమస్యలు వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిశీలన
- మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్



ఆసుపాక గ్రామస్తులతో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్

అశ్వారావుపేటరూరల్: వేసవిలో వచ్చిన గాలిదుమారాలతో తరచూ విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. అయితే, తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలతోపాటు మిషన్ భగీరథ ద్వారా సరఫరాలో ఇబ్బంది ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. అశ్వారావుపేటలోని మిషన్ భగీరథ డివిజన్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లోని గ్రామాల్లో సమస్య వచ్చిందని తెలిపారు. దీనికి ప్రధాన కారణం విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ములకల్లిపల్లి మండలంలోని తోగ్గూడెం వద్ద జరిగిన అభివృద్ధి పనుల కారణంగా పైపులైన్లు దెబ్బతినడమేనన్నారు. తరచూ విద్యుత్ నిలిచిపోవడంతో తాగునీటి సరఫరాల్లో జాప్యం ఎదురవుతోందని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2,400 కి.మీ. మేర పైపులైన్లు ఉన్నాయని ఆయన వెల్లడించారు. 2020లో అశ్వాపురం వద్ద ఉన్న హెవీ వాటర్ ప్లాంట్ నిలిచిపోయినా, మిషన్ భగీరథ ద్వారా సరఫరా ఆగలేదని సీఈ గుర్తుచేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని 12 హ్యాబిటేషన్లలో సమస్య ఉన్నట్లు తెలుస్తుండగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రతిపాదనలు చేస్తామన్నారు. అశ్వారావుపేట తాగునీటి సరఫరా గ్రీన్ జోన్‌లోనే ఉండేదని, కొద్ది రోజులుగా రెడ్ జోన్‌లోకి వచ్చిందని తెలిపారు. ఇలాంటి సమస్యలే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ ఉండగా.. పది రోజుల్లో సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సీఈ స్పష్టం చేశారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్, డీఈఈ సలీం, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఏఈలు లక్ష్మి, వంశీ, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, చిన్నంశెట్టి వెంకట నరసింహం పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఈ సందర్శన

నియోజకవర్గంలోని అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా తరచూ నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సమస్యను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రెండు రోజుల కిందట సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం కేసీఆర్.. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని నారాయణపురం, పెదవాగు ప్రాజెక్ట్, గుమ్మడవల్లి, నందిపాడు, కుడుములపాడు, నెమలిపేట, పెంచికలపాడు, వడ్డెర రంగాపురం, కోయ రంగాపురం, గాండ్లగూడెం గ్రామాల్లో పర్యటించి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఆ తర్వాత పెదవాగు ప్రాజెక్ట్ వద్ద ఫ్లోరైడ్ రహిత తాగునీటి ప్రాజెక్ట్‌ను కూడా పరిశీలించారు. ఈ తాగునీటి పథకానికి మరమ్మతులు చేస్తే దాదాపు 17 గ్రామాలకు మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయంగా నీరు అందించే అవకాశం ఉంటుందని స్థానికులు సీఈ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



గురుకుల పాఠశాలలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: వర్షాకాలం మొదలైన నేపథ్యాన గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదులు, స్టోర్‌రూమ్, తాగునీటి ట్యాంక్, బియ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. వాతావరణంలో మార్పులతో విద్యార్థినులు అనారోగ్యానికి గురయ్యే అవకాశమున్నందున హెచ్‌ఎం, వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యపరీక్షలు చేయించాలని, మెనూ ప్రకారం వేడి ఆహార పదార్థాలనే వడ్డించాలని తెలిపారు. వంటగది, డైనింగ్ హాల్, తాగునీటి వనరుల పరిశుభ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ భూములను పరిశీలించిన ఏఐజీఎఫ్



కేటీసీ ఏరియాలో మొక్కలు నాటుతున్న ఏఐజీఎఫ్, అధికారులు

టేకులపల్లి: మండలంలోని సింగరేణి కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఏరియాలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ (ఏఐజీఎఫ్) కై లేశ్‌భీంరావు భవార్ శనివారం పర్యటించారు. సింగరేణికి అప్పగించిన అటవీ భూములను పరిశీలించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. అలాగే, ఓసీ వ్యూ పాయింట్ నుంచి గనుల్లో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలు, పర్యావరణ నిబంధనల అమలును పరిశీలించాక మొక్కలు నాటారు. సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో పాటు అటవీ శాఖ, సింగరేణి అధికారులు సురేంద్ర పాండే, రవిప్రసాద్, ప్రహ్లాద్, సౌరభ్ సుమన్, ధనుంజయరెడ్డి, హరినారాయణ, మహేశ్వర్, శివకుమార్, తావుర్యానాయక్, అప్పయ్య, ముక్తార్ హుస్సేన్ పాల్గొన్నారు.

రంగనాయకుల సేవలు మరువలేనివి

పీడీఎస్‌యూ మాజీ నేతకు పోటు రంగారావు నివాళి



రంగనాయకులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రంగారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పంపింగ్ వెల్‌కు రోడ్డుకు చెందిన పీడీఎస్‌యూ మాజీ నాయకుడు రంగనాయకులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు ఆయన మృతదేహం వద్ద శనివారం ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, పీడీఎస్‌యూ నాయకులు నివాళులర్పించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ పీడీఎస్‌యూ పాతతరం నేతల్లో పరిచయం అక్కరలేని రంగనాయకులు ఎక్కడ సభ జరిగినా ముందు నిలిచేవారని, ఆయన రాసిన నినాదాలు ఇంకా గోడలపై కనిపిస్తాయని తెలిపారు. పలు దినపత్రికల్లోనూ సబ్ ఎడిటర్‌గా విధులు నిర్వర్తించిన రంగనాయకులు మృతి బాధాకరమని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో ప్రజాపంథా నాయకులు గోకినపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, శివలింగం, ఎన్డీ నాయకుడు సాగర్, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, తరుణ్, గణేష్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎంపీ వద్దిరాజుకు 'ఆప్టా' ఆహ్వానం



ఎంపీ రవిచంద్రతో ఆప్టా ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: అట్లాంటాలో జరగనున్న సదస్సుకు హాజరుకావాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను అమెరికన్ ప్రోగ్రెసివ్(ఆప్టా) తెలుగు అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు శనివారం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం అందజేశారు. సెప్టెంబర్ 1నుంచి 3వరకు జరిగే సదస్సులో పాల్గొనాలని కోరారు. ఆప్టా అధ్యక్షుడు కొట్టే ఉదయభాస్కర్ తరపున మాజీ అధ్యక్షుడు గూడపాటి గోపాల ఆహ్వానపత్రిక అందజేయగా ప్రముఖ వ్యాపారి సుధీర్‌కుమార్, డాక్టర్ సెట్లం రంగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహించే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని గురుకుల కళాశాలల్లో ఫిజిక్స్ నాలుగు, గణితం, జువాలజీ రెండు, తెలుగు, ఇంగ్లిష్, బాటనీ జూనియర్ లెక్చరర్ పోస్టులు ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నా రు. అలాగే, పాఠశాలల్లో గణితం రెండు పోస్టులతో పాటు ఇంగ్లిష్, సైన్స్, సాంఘిక శాస్త్రం, పీటీటీ ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈడీ, పీజీ అర్హతతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు ఈ నెల 29వ తేదీ లోగా ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. అభ్యర్థులకు జూలై 3న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూ ఉంటాయని ఆర్‌సీఓ వివరించారు.

గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు...

ఖమ్మం రీజియన్ పరిధిలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం ఎస్ఎన్ మూర్తి కళాశాలలో నిర్వహిస్తున్న మహిళా కళాశాల, కొత్తగూడెంలో ఏర్పాటుచేసే పురుషుల గురుకుల కళాశాలలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రఘునాథపాలెం కళాశాలలో దరఖాస్తులను ఇవ్వాలని, వివరాలకు 90103 45351, 80194 22103 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అలాగే, అలాగే డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాకుల పోస్టులకు తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేయనుండగా పీజీ, బీఈడీ, ఎన్ఈటీ సెట్, పీహెచ్‌డీ చేసి బోధన అనుభవం ఉన్న వారు అర్హులని తెలిపా రు. అంతేకాకుండా గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోష ల్, బయాలజీ ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి ఉన్న వారు పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అర్హులు ఈనెల 28లోగా ఖమ్మం కలెక్టర్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని, సమాచారం కోసం 79899 33241 నంబర్‌లో సంప్రదించాలని ఆర్‌సీఓ సూచించారు.